జెడిఎకు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం బృందం

కంది కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో రైతులు పండించిన కంది పంట కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం సిపిఎం ప్రతినిధి బృందం ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఉమా మహేశ్వరమ్మను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నల్లప్ప మాట్లాడుతూ సిపిఎం ప్రతినిధి బృందం అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామంలో కంది పంట విక్రయించుకోవడానికి ఎదురు చూస్తున్న రైతులను కలిసినట్లు తెలిపారు. రైతులు శివారెడ్డి, రాము, రామ్మోహన, రామచంద్ర, ఆదినారాయణ రైతులను కలిసి వివరాలను సేకరించామన్నారు. పండించిన కందిని గిట్టుబాటు ధరతో విక్రయించుకోలేని దీనస్థితిలో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి రైతులకు కంది పంటకు గిట్టుబాటు ధర కల్పించి, గిట్టుబాటు ధరకు అధనంగా బోనస్‌గా క్వింటాల్‌కు రూ.2 వేలు ఇవ్వాలన్నారు. అనంతపురం జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 1.10 లక్షల హెక్టార్లలో కంది పంటను సాగు చేశారని తెలిపారు. 80 వేల మెట్రిక్ టన్నులకు పైగా పంట దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోందన్నారు. వేరుశనగ గిట్టుబాటు కాకపోవడంతో ఎక్కువ మంది రైతులు కంది పంటను సాగు చేశారని వివరించారు. వచ్చిన కంది పంట దిగుబడిని సకాలంలో అమ్ముకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున రైతు సంఘాలు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసి కొనాలని కోనినట్లు తెలిపారు. రైతులను తమ పేర్లను నమోదు చేసుకోవాలని అధికారులు కోరిన తర్వాత అనంతపురం జిల్లాలో 1440 మంది రైతులు తమ పేర్ల నమోదు చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వం మాత్రం 45 వేల మెట్రిక్ టన్నుల మాత్రమే కొంటామని చెప్పడంతో రైతులు ఆందోళన పడుతున్నారని తెలిపారు. వెంటనే కంది పంట కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి బోనస్‌గా రూ.2 వేల అదనంగా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన జేడిఏ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు తరిమెల నాగరాజు, కె.భాస్కర్, వలి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

రైలు మార్గం.. నిర్మాణంలో జాప్యం..!

◆ నిర్మాణ దశలోనే రాయదుర్గం - తుమకూరు రైలు మార్గం

◆ మూడేళ్లలో పూర్తి చేస్తామంటూ కేంద్ర మంత్రి ప్రకటన

◆ ఆచరణలో పనుల్లో కనిపించని వేగం

రాయదుర్గం- తుమకూరు పట్టణాల మధ్య రైలు మార్గ నిర్మాణం వచ్చే మూడేళ్లలో పూర్తి అయ్యేనా అని ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. 2027 ఫిబ్రవరి నాటికి రైలు మార్గ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తుమకూరు పార్లమెంటు సభ్యులు, కేంద్ర జల వనరులు, రైల్వే శాఖ సహాయ మంత్రి వి.సోమన్న తరచూ సభలు, సమావేశాలు, పత్రికా విలేకరుల సమావేశాల్లో చెబుతూనే ఉన్నారు. దశాబ్ద కాలంగా కనీసం సగం దూరం కూడా రైలు మార్గం నిర్మాణ పనులు పూర్తి కాలేదు. ఈ పరిస్థితుల్లో వచ్చే మూడేళ్లలో రైలు మార్గ నిర్మాణం ఏ మేర పూర్తవుతుందో అన్న సందేహాలు

ప్రజాశక్తి-రాయదుర్గం

206.53 కిలోమీటర్ల పొడవు గల రైలు మార్గ నిర్మాణ పనులను రూ.1714.50 కోట్ల అంచనాతో 2012లో ప్రారంభించారు. 2016 డిసెంబర్ నాటికి రాయదుర్గం -కళ్యాణదుర్గం రైలు మార్గ నిర్మాణం పనులు పూర్తి చేసి ప్రారంభించారు. 2017 ఏప్రిల్ నెలలో కళ్యాణదుర్గం నుంచి కదిరిదేవరపల్లి వరకు రైలు మార్గ నిర్మాణం పూర్తి చేసి కదిరిదేవరపల్లి నుంచి తిరుపతికి ప్యాసింజర్ రైలు సర్వీసును ప్రారంభించారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంత ప్రజలకు ఎంతో అనుకూలంగా ఉన్న ఈ రైలు సర్వీసు ఏడాది క్రితం మరమ్మతు, అభివద్ధి పనుల సాకుతో నిలిపివేశారు. నెలనెలా రైలు సర్వీసును వాయిదా వేస్తూ వస్తున్నారు. ఏడాది గడిచినప్పటికీ ఇప్పటివరకు దీని మరమ్మతు, అభివృద్ధి పనులు చేపట్టలేదు. ఈ ప్రాంత ప్రజలకు అనువుగా ఉన్న తిరుపతి- కదిరిదేవరపల్లి రైలు సర్వీసును పున్ణ ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నా అందుకు అనుగుణంగా పనులు ముందుకు సాగడం లేదు.

కదిరిదేవరపల్లి నుంచి దొడ్డహళ్లి వరకు రైలు మార్గాన్ని నిర్మించారు. రైల్వే సేఫ్టీ కమిషనర్ ఈ మార్గాన్ని తనిఖీ చేసి నిర్మాణంపై సంతృప్తి వ్యక్తం చేశారు. 206.53 కిలోమీటర్లకు గాను ప్రస్తుతం 103 కిలోమీటర్ల నిర్మాణం పూర్తికాగా104 కిలోమీటర్ల పనులు చేపట్టాల్సి ఉంది. రైలు మార్గ నిర్మాణం అంచనా వ్యయం రూ.1714.50 కోట్ల నుంచి రూ.2450 కోట్లకు పెరిగింది. నిర్మాణం వ్యయంలో రైల్వే శాఖ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం నిధులు సమకూర్చాల్సి ఉంటుంది. ప్రస్తుతం దొడ్డహళ్లి నుంచి కర్ణాటక రాష్ట్రంలోని పావగడ సమీపంలో గల కె.రాంపుర వరకు రైల్వే స్టేషన్, రైలు మార్గ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. తుమకూరు నుంచి ఉరుకెరే వరకు రైలు మార్గ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మార్చి నెలాఖరుకు ఈ పనులు పూర్తి చేయాలని లక్ష్యాన్ని రైల్వే అధికారులు నిర్దేశించారు.



ఉరుకెరె వద్ద నిర్మాణంలో ఉన్న రైలు మార్గం

డబ్లింగ్, కొత్త రైలు మార్గ నిర్మాణం ఎప్పుడో..?

రాయదుర్గం మీదుగా బళ్లారి నుంచి చిక్కజాజారీరు వరకు 185 కిలోమీటర్ల డబ్లింగ్ పనులకు గత ఏడాది ఫిబ్రవరి నెలలో డిపిఆర్ రైల్వే శాఖకు సమర్పించారు. రాయదుర్గం నుంచి తుమకూరు (ఉరుకెరె) వరకు 194 కిలోమీటర్ల డబ్లింగ్ పనులకు రైల్వే బోర్డు ఆమోదం లభించాల్సి ఉంది. స్వామిహళ్లి నుంచి రాయదుర్గం వరకు 52 కిలోమీటర్ల కొత్త రైలు మార్గ నిర్మాణానికి 2022 సంవత్సరంలో రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. ప్రస్తుతం సర్వే పనులు కొనసాగుతున్నాయి. రాయదుర్గం బళ్లారి సెక్షన్లో బాదనహాల్ వద్ద క్రాసింగ్ రైల్వే స్టేషన్ నిర్మాణం పనులు జరుగుతున్నాయి.

భూ సేకరణ చిక్కులు

కర్ణాటక రాష్ట్రంలో ఈ రైలు మార్గ నిర్మాణానికి వివిధ ప్రాంతాల్లో 36 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. 130 మంది భూ యజమానులకు పరిహారం చెల్లించాల్సి ఉంది. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ప్రక్రియను ఆమోదించగానే వెంటనే పరిహారం చెల్లిస్తామని రాయదుర్గం- తుమకూరు రైలు మార్గ భూ సేకరణ ప్రత్యేక అధికారి రేణు ప్రసాద్ జంబగి తెలిపారు. ఇంకా 10 గ్రామాల మధ్య భూ సమస్య ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉరుకెరె- తుమకూరు నడుమ భూస్వాధీన ప్రక్రియ జరుగుతోంది.



రాయదుర్గం తుమకూరు రైల్వే మ్యాప్

రైల్వే స్టేషన్‌లో మౌలిక సౌకర్యాలు కరువు

రాయదుర్గం రైల్వే స్టేషన్ రైలు మార్గ నిర్మాణంలో భాగంగా కొత్త స్టేషన్‌ను నిర్మించారు. ఈ స్టేషన్‌లో ప్రయాణికులకు మౌలిక సౌకర్యాలు లోపించాయి. తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, నీడ సదుపాయాలు లేవు. రూ.10.5 కోట్లు ఖర్చుచేసినా కనీసం రెండో ఫ్లాట్ ఫారం విస్తరణ, పైకప్పు ఏర్పాటు జరగలేదు.

ఉరుకెరె రైల్వే స్టేషన్ భవన నిర్మాణం

సానుకూల స్పందన

ఇటీవల కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి వి.సోమన్నను తుమకూరులో కలిసి రాయదుర్గం- తుమకూరు రైలు మార్గ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని కోరాం. రాయదుర్గం రైల్వే స్టేషన్లో మౌలిక సౌకర్యాలు కల్పించడంతో పాటు ఎక్స్‌ప్రెస్ రైలు ఆపాలని, రాయదుర్గం రైల్వే స్టేషన్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశాం. అర్ధాంతరంగా ఆగిన రైల్వే ఓవర్ బ్రిడ్జిలను నిర్మించడంతోపాటు బళ్లారి, బిటిపి రోడ్లలో కొత్త రైలు వంతెనలు నిర్మించాలని రైల్వే మంత్రిని కోరగా వీటిన్నింటిపై ఆయన సానుకూలంగా స్పందించారు.

కాలవ శ్రీనివాసులు ప్రభుత్వ విప్.

సమస్యలను విన్నవించాం..

రాయదుర్గం-తుమకూరు రైలు మార్గ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి ఈ మార్గంలో పలు రైలు సర్వీసులను ప్రవేశపెట్టాలని కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి వి.సోమన్నను కోరాం. రాయదుర్గం జంక్షన్‌లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని, ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని విన్నవించాం.

అంబిక లక్ష్మీనారాయణ, అనంతపురం ఎంపీ.

గుండెపోటుతో బిఎస్ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ మృతి

వెంకటరమణారెడ్డి (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణ నాగులబావి కాలనీకి చెందిన బిఎస్ఎఫ్ జవాను వెంకటరమణారెడ్డి (40) కాశ్మీర్‌లో విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... చెన్నేకొత్తపల్లి మండలం బసినేపల్లి గ్రామానికి చెందిన వెంకటరమణారెడ్డి బిఎస్ఎఫ్ హెడ్ కానిస్టేబుల్‌గా కాశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం వీరి కుటుంబం ధర్మవరం పట్టణంలో నివాసం ఉంటోంది. ఇటీవల కాశ్మీర్‌లో అతి తక్కువ ఉష్ణోగ్రత ఉండడంతో వెంకటరమణారెడ్డి బుధవారం నాడు గుండెపోటుకు గురై మరణించాడు. ఈ మేరకు సమాచారాన్ని ఆర్మీ అధికారులు కుటుంబ సభ్యులకు అందించారు. మతునికి భార్య హరిప్రియ, కుమారుడు మహిధర్ రెడ్డి, కుమార్తె రిత్విక ఉన్నారు. జవాను పార్థివదేహం కాశ్మీర్ నుంచి ధర్మవరానికి గురువారం రాత్రి చేరుకుంటుందని ఆర్మీ వర్గాలు తెలిపాయి. జవాను స్వగ్రామం బసినేపల్లిలో అంత్యక్రియలు నిర్వహించేందుకు అధికారులు, కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. జవాను ఆకస్మిక మృతిపై గ్రామస్తులు, స్నేహితులు, మాజీ ఆర్మీ ఉద్యోగులు సంతాపం తెలిపారు.

మహిళ జుట్టు కత్తిరించిన వారిపై చర్యలు తీసుకోండి : ఐద్వా

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

శ్రీ సత్యసాయి జిల్లా పెనుగొండ మండలం మహిళను వివస్త్రను చేసిన జుట్టు కత్తిరించిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రేమ జంటకు సహకరించారనే నెపంతో మహిళను వివస్త్రను చేసి జుట్టు కత్తిరించడం అనాగరికం అన్నారు. ఆమె తప్పు చేసివుంటే చట్ట పరమైన చర్యలు తీసుకోవాలి గానీ ఈ రకంగా చేయడం మహిళలను అవమానించడమే అన్నారు. మహిళా మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పెనుకొండలో ఇలాంటి సంఘటన జరుగడం విచాకరం అన్నారు. ఆమెపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఐద్వా నాయకులు శ్యామల, చంద్రిక కోరారు.

పక్షుల కోసం మానవ నిర్మిత గూళ్లు

హార్వర్డ్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదు-కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి-అనంతపురం

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న

పక్షులను రక్షించడానికి 1.40 లక్షల మానవ నిర్మిత గూళ్లు ఏర్పాటు చేసి హార్వర్డ్ వరల్డ్ రికార్డ్సులో నమోదు కావడం అభినందనీయమని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ తెలిపారు. గ్రీన్ ఆర్మీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అనంతపురం అనిల్ కుమార్ పక్షులను రక్షించడానికి 1.40 లక్షల మానవ నిర్మిత గూళ్లు ఏర్పాటు చేయగా, యూకే (లండన్)కు చెందిన హార్వర్డ్ వరల్డ్ రికార్డ్సులో ఇది నమోదు అయ్యింది. అందుకు సంబంధించిన సర్టిఫికెట్ అందించిన నేపథ్యంలో అనిల్‌కుమార్ గురువారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్నలను కలిశారు. ఈ సందర్భంగా గ్రీన్ ఆర్మీ స్వచ్ఛంద సంస్థ అనంతపురం అనిల్ కుమార్ మాట్లాడుతూ అనంతపురం నగరంలో గ్రీన్ ఆర్మీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పక్షులను రక్షించడానికి 1.40 లక్షల మానవ నిర్మిత గూళ్లను ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడా లేని విధంగా సహజ కొబ్బరి కాయతో 1.40 లక్షల మానవ నిర్మిత గూళ్ళను ఏర్పాటు చేశామన్నారు. అందులో 2.50 లక్షల పిచ్చుకలు జన్మించాయని తెలిపారు. అనంతరం 'ప్రతి ఇంటా ఓ చెట్టు, ప్రతి ఇంటిపై మన జెండా' అనే పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి

ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కారానికి అందరూ సహకరించాలని ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి కోరారు. గురువారం మండలంలోని విరుపాపురం, వెంకటాంపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలు డ్రెయినేజీలు, రోడ్డు, తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా వెంకటాంపల్లిలో డ్రెయినేజీ సమస్య కారణంగా మురుగునీరు ఎక్కడికి వెళ్లకుండా ఇళ్లచివరి వద్ద ఆగి భరించలేని దుర్వాసన వెదజల్లుతోందని ప్రజలు వాపోయారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ స్వయంగా ఎమ్మెల్యేనే డ్రెయినేజీ వద్దకు వెళ్లి పరిశీలించారు. వెంటనే అంచనాలను తయారు చేయించాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఇరుకు మధ్యన కేంద్రాన్ని కొనసాగించడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వెంటనే గదిని ఖాళీ చేసి మరోచోట ఉండేలా చూడాలని తహశీల్దార్ ఉషారాణికి సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఏళ్ల తరబడిగా అభివృద్ధికి నోచుకోని రోడ్లను మారుస్తున్నామన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఉత్తర కాలువ డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ రాజారెడ్డి, టిడిపి మండల నాయకులు కొండూరు కేశవరెడ్డి, ఆవులాంపల్లి కేశవరెడ్డి, బాలిరెడ్డి, తిలక్‌రెడ్డి, తిమ్మారెడ్డి, ప్రసాద్, చిరంజీవులు, హరి, రమేష్‌యాదవ్, ఎంపిటిసి గోవిందు, నాగరాజు, దాదావలి, తహశీల్దార్ ఉషారాణి, ఎంపిడిఒ నరసింహారెడ్డి, పంచాయతీరాజ్ ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్లు వరప్రసాద్, ఆంజనేయులు, ఎఒ మల్లేశ్వరి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ఎపిఒ పుల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగం

పుట్లూరు : మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో ఎఇఒ హరి ఆధ్వర్యంలో గురువారం పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఇందులో భాగంగా జొన్న పంటలో 5మీ పొడవు, 5 మీ వెడల్పులో పంటకోత ప్రయోగం నిర్వహించగా 36 కంకులు 1.550 కేజీల దిగుబడి వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఎ నల్లప్ప, రైతులు పాల్గొన్నారు.

సజావుగా కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

నగరంలోని నీలం సంజీవరెడ్డి మైదానంలో గురువారం ఉదయం ప్రారంభమైన పోలీస్ కానిస్టేబుళ్ల అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు సజావుగా కొనసాగాయి. స్వయంగా ఎస్పీ పి.జగదీష్ దగ్గరుండి సిసి కెమెరాల పర్యవేక్షణలో పారదర్శకంగా పరీక్షలు కొనసాగేలా చర్యలు తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ స్టేట్ లెవెల్ రిక్రూట్మెంట్ బోర్డ్ నియమ నిబంధనలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి పకడ్బందీగా దేహదారుఢ్య పరీక్షల నిర్వహించారు. ఎత్తు, ఛాతీ కొలతల అనంతరం 1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షల్లో పురుష అభ్యర్థులు పాల్గొన్నారు. ఉద్యోగాలు ప్రతిభ ఆధారంగా మాత్రమే వస్తాయని, ఎట్టి పరిస్థితుల్లో దళారులను ఆశ్రయించి మోసపోవద్దని ఎస్పీ సూచించారు. ఇకపోతే ఈనెల 8, 9, 10వతేదీల్లో జరగాల్సిన దేహదారుఢ్య పరీక్షలు ఈనెల 17, 18, 20వతేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. అప్పీలు అభ్యర్థులు ఈనెల 21న హాజరు కావాలని కోరారు.

కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఎస్పీ పి.జగదీష్

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలి

జెడ్పీ సిఇఒ రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-నార్పల

మండలవ్యాప్తంగా గ్రామాల్లోని చెత్త సంపద కేంద్రాలను వీలైనంత త్వరలో వినియోగంలోకి తీసుకురావాలని జెడ్పీ సిఇఒ రామచంద్రారెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని చెత్త సంపద కేంద్రాన్ని ఎంపిపి నాగేశ్వరరావు, సర్పంచి సుప్రియతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావడంతోపాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు పొడి, తడి చెత్తపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంపై అవగాహన కల్పించి వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయాన్ని సందర్శించి పలు రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ గంగావతి, ఇఒఆర్‌డి శైలజారాణి, కార్యదర్శి శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : మండల కేంద్రంలోని సచివాలయంతోపాటు వాటర్ పంప్‌హౌస్‌ను జెడ్పీ సిఇఒ రామచంద్రారెడ్డి గురువారం ఆకస్మికం తనిఖీ చేశారు. తర్వాత ఎంపిడిఒ కార్యాలయాన్ని పరిశీలించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అధికారులు అందరూ తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. ప్రతి ఒక్క ఉద్యోగి అంకితభావంతో పని చేసి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శకుంతలమ్మ, ఇఒఆర్‌డి సురేష్‌బాబు, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నార్పలలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సిఇఒ రామచంద్రారెడ్డి

కియాలో సైరోస్ ప్రీ బుకింగ్ ప్రారంభం

ప్రజాశక్తి-పెనుకొండ

సైరోస్ ఆవిష్కరణ సందర్భంగా కియా సిబ్బంది, ప్రతినిధులు

కియా సైరోస్ ప్రీ బుకింగ్‌ను కియా ఇండియా గురువారం ప్రారంభించింది. పెనుకొండ మండలం యర్రమంచిలో ఉన్న పరిశ్రమలో కియా కార్పొరేషన్ ప్రెసిడెంట్, సీఈవో హెరీ సంగ్ సాంగ్, కియా ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ గ్వాంగులీతో సహా సీనియర్ కియా ఎగ్జిక్యూటివులు ప్రీ బుకింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కియా కార్పొరేషన్ ప్రెసిడెంట్, సీఈవో హెరీ సంగ్ సాంగ్ మాట్లాడుతూ భారతీయ ఆటోమోటివ్ ల్యాండ్స్‌స్కేప్ను భవిష్యత్ ఎస్‌యువి సైరోసు అన్నారు. భవిష్యత్ ఫీచర్లు సెగ్మెంట్- లీడింగ్ ఇన్నోవేషన్స్, ప్రతి కొత్త మోడళ్లలో తీసుకువస్తామన్నారు. కియా సైరోస్‌లో ఆధునిక టెక్నాలజీ ఉపయోగించామన్నారు. కియా సైరోస్లో అత్యాధునిక ఫ్యూచర్స్‌ను అందిస్తున్నట్లు చెప్పారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా సిరోసను రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఒ షెమారంజయ్, కియా ఉద్యోగులు పాల్గొన్నారు.

రీసర్వే సమస్యలపై ఫోన్ ఇన్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఫోన్ ఇన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్

భూముల రీసర్వే సమస్యల అంశంపై కలెక్టర్ సర్వే శాఖ అధికారులతో కలిసి అనంతపురం రేడియో స్టేషన్‌లో గురువారం నాడు ఆకాశవాణి ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగు చేస్తున్న రైతులు, భూమి పొందిన రైతులు అందరూ వారి సచివాలయ పరిధిలో అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకుని సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. జిల్లాలోని పలు ప్రాంతాల రైతుల, ప్రజల నుంచి 12 ఫోన్ కాల్స్ స్వీకరించి వారి సమస్యలను కలెక్టర్ తెలుసుకున్నారు. ఈ సమస్యల పరిష్కారంపై సంబంధిత శాఖ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్వే ఏడీ రూప్ల నాయక్, డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, డైరెక్టర్ ఆకాశవాణి అనంతపురం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రిమాండ్ ఖైదీ మృతి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం సబ్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న కేశవ నారాయణ(50) అనారోగ్యంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఇందుకు సంబంధించి వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పామిడి మండలం దేవరపల్లికి చెందిన కేశవనారాయణ ఆలియాస్ శ్రీనివాసులు బత్తలపల్లి మండలంలో రైతుల నుంచి పశువులు కొనుగోలు చేసి డబ్బులు చెల్లించలేదు. దీంతో రైతులు బత్తలపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేవారు. ఈ ఫిర్యాదు మేరకు బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసి ఈనెల 2వ తేదీన కేశవ నారాయణను అరెస్టు చేసి ధర్మవరం సబ్ జైలుకు రిమాండ్‌కు పంపారు. జైలులో ఉండగా ఈనెల 15వ తేదీన ఆయన అస్వస్థకు గురయ్యాడు. సబ్ జైలు అధికారులు చికిత్స నిమిత్తం ఆయన్ను అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కేశవ నారాయణ మతి చెందాడు. జైలు, ఆసుపత్రి నియమ నిబంధనల ప్రకారం కార్యక్రమాలను పూర్తి చేసిన తర్వాత కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అందజేస్తామని సబ్ జైలు అధికారి తెలిపారు.

వివాదాస్పద డ్రైయినేజీ పరిశీలన

డ్రైయినేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని పాత బస్టాండ్ ఆవరణలో గాంధీ సర్కిల్ నుంచి కూతలేరు వంక వరకూ వివాదాస్పదంగా మారిన డ్రైయినేజీ కాలువను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ గురువారం పరిశీలించారు. మండల నడిబొడ్డున బస్టాండ్ ఆవరణలో గుంతలు తవ్వి ఇలా వదిలేస్తే ఎలా..? అని అధికారులను ఎమ్మెల్యే ప్రశ్నించారు. స్థానిక సమస్యలపై అధికారులు ఎమ్మెల్యే వద్ద ప్రస్తావించగా.. అవన్నీ అవసరం లేదని, తన ఆదేశాలను పాటించాలని సూచించారు. ఈ సందర్భంలో కొందరు ఎమ్మెల్యే సమక్షంలోనే వాగ్వివాదానికి దిగగా వారిని వారించారు. తర్వాత స్థానికంగా నివాసం ఉండే దూల్‌పేట కాలనీవాసులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఎమ్మెల్యేకు విన్నవించారు. వారం రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని ఎమ్మెల్యే కాలనీవాసులకు హామీ ఇచ్చారు. తర్వాత కాలువ నిర్మాణ పనులు తమకే ఇవ్వాలని ఓ మహిళ ఎమ్మెల్యేకు విన్నవించగా పైప్‌లైన్ పనులు ఎవరంటే వారు చేయడానికి వీలుకాదని, అధికారులు మాత్రమే చేస్తారని వివరించారు. ఇకపోతే కూతలేరు వంకలో పేరుకొని పోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని అధికారులను ఆదేశించారు. వాల్మీకి విగ్రహం వద్ద ఉన్న కుండలను తొలగించాలని సూచించారు. అలాగే మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని సూచించారు. తర్వాత కూతలేరు బ్రిడ్జి సమీపంలో మహాత్మా గాంధీ విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బండ్లపల్లి కుళ్లాయప్ప, బుక్కరాయసముద్రం, నార్పల నీటి సంఘాల అధ్యక్షులు ఆలం నాగార్జున, గవ్వల పరంధామ, ఆకుల విజయ్‌కుమార్ (బాబు), జిసి బాబు, ఆకుల ప్రసాద్, సుల్తాన్‌పేట మహేష్‌నాయుడు, జనసేన మండల కన్వీనర్ గంజికుంట రామకృష్ణ, ఎంపిడిఒ గంగావతి, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసమూర్తి, సిఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్, మండల సర్వేయర్ బ్రహ్మానంద, ఇఒఆర్‌డి శైలజారాణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ జనార్ధన్, మేజర్ పంచాయతీ కార్యదర్శి శ్యామల, వీఆర్వోలు నిరంజన్‌రావు, శివరామ్, రామాంజనేయులు, బాలనాగి నరేష్, గూగూడు జాఫర్, సాలేహా, రామానాయుడు, ప్రసాద్ నాయుడు, చిన్నచౌదరి, ఎల్ ఇస్మాయిల్, ప్రదీప్, లోకేష్, రామాంజనేయులు, వేణుగోపాల్, నరసింహులు, అంకన్న, పప్పూరు సూర్యనారాయణ, రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఇస్తేమా ఏర్పాట్లు పరిశీలన

మండల కేంద్రంలో ఈనెల 18, 19వతేదీల్లో నిర్వహించనున్న ఇస్తేమా ఏర్పాట్లను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ గురువారం పరిశీలించారు. ఇందులో భాగంగా ముస్లిం మత పెద్దలతో చర్చించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఏ సహకారం కావాలన్నా పూర్తిస్థాయిలో అందిస్తామని హామీ ఇచ్చారు.

క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

క్యాలెండర్ ఆవిష్కరణ

అనంతపురం : ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ వినోద్‌కుమార్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు కె.అల్తాఫ్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం, రాజ్యాంగం, గ్రామసభలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సాంబశివుడు, ఉపాధ్యక్షులు కె.సుబ్బరాయుడు, కోశాధికారి టివి.రెడ్డి, కెఎల్ఎన్ ప్రసాద్, బసప్ప, తదితరులు పాల్గొన్నారు.

నాగుల కట్టకు స్థలం కేటాయించాలని వినతి

బుక్కరాయసముద్రం : నాగలకట్టకు స్థలం కేటాయించాలని చెదుళ్ల గ్రామస్తులు తహశీల్దార్ పుణ్యవతికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చెదుల్లా సర్పంచి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ చెదుళ్ల గ్రామం సర్వే నంబర్ 44లో నాగలకట్ట ఆలయం నిర్మించేందుకు ప్రభుత్వ స్థలంలో 10 సెంట్ల స్థలాన్ని కేటాయించాలని గ్రామ పంచాయతీ తీర్మాన ప్రకారం గ్రామస్తుల ఆధ్వర్యంలో అంగీకారం చేసుకున్నట్లు వివరించారు. ఇందుకు తహశీల్దార్ స్పందిస్తూ స్థలాన్ని పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నాగలింగారెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, నారాయణరెడ్డి, లక్ష్మీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో ముళ్ల పొదల తొలగింపు

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం నగరంలోని 6వ రోడ్డులో ఉన్న శ్మశానవాటికకు ఎమ్మెల్యే దగ్గుపాటి చొరవతో ముళ్ల పొదలను తొలగించారు. ఎమ్మెల్యే పింఛన్ల పంపిణీలో భాగంగా 6వ రోడ్డుకు వచ్చారు. శ్మశానవాటికలో ఉన్న పరిస్థితుల గురించి స్థానికులు ఎమ్మెల్యే దష్టికి తీసుకొచ్చారు. ఇక్కడ ఎంత అధ్వాన్న పరిస్థితులు ఉన్నాయన్నది వివరించారు. దీనిపై ఎమ్మెల్యే దగ్గుపాటి వెంటనే స్పందించారు. శ్మశానవాటికను శుభ్రం చేయాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో మున్సిపల్ సిబ్బంది శ్మశానవాటికను శుభ్రం చేశారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ

బ్రహ్మసముద్రం : ద్విచక్ర వాహనాల్లో ప్రయాణించే వాహనదారులు హెల్మెట్ తప్పని సరిగా వినియోగించాలని ఎస్ఐ నరేంద్ర కుమార్ తెలిపారు. గురువారం ఆయన తన సిబ్బందితో కలిసి నాగిరెడ్డిపల్లి ఫారెస్ట్ వద్ద వాహనదారులను ఆపి రోడ్డు నిబంధనలు, హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ప్రాణాలకు రక్షణ ఇస్తుందన్నారు.

మాజీ సర్పంచి మృతికి సంతాపం

రాయదుర్గం : రాయదుర్గం మండలం చదం గొల్లలదొడ్డి గ్రామ మాజీ సర్పంచి గొల్ల ఎర్రప్ప గురువారం అనారోగ్యంతో మరణించారు. ఎర్రప్ప మృతి చెందిన విషయం తెలుసుకున్న రాయదుర్గం మాజీ శాసనసభ్యులు కాపు రామచంద్ర రెడ్డి ఆ గ్రామానికి వెళ్లి గొల్ల ఎర్రప్ప భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలతో నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

టిడిపి కార్యకర్త మృతికి నివాళి

పామిడి : స్థానిక 3వవార్డుకు చెందిన చెందిన టిడిపి కార్యకర్త ఖలీల్ అనారోగ్యంతో మృతిచెందటంతో విషయం తెలుసుకున్న టిడిపి మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ గురువారం మృతుడి నివాసానికి చేరుకుని మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లఘు చిత్రాల పండుగ పోస్టర్ విడుదల

అనంతపురం : నగరంలోని అనంతపురం ఫిల్మ్ సొసైటీ కార్యాలయంలో అధ్యక్షులు రషీద్‌బాషా ఆధ్వర్యంలో గురువారం లఘు చిత్రాల పండుగ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ మురళీధర్, సెక్రటరీ, యాంకర్ రమేష్, సొసైటీ సభ్యులు తోట బాలన్న, కత్తి విజయ్‌కుమార్ మాట్లాడుతూ అనంతపురం ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆరురోజులపాటు ఉత్సవాలు నిర్వహించి లఘు చిత్రాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఔత్సాహిక కళాకారులు, లఘుచిత్రాల డైరెక్టర్లు, కొరియోగ్రాఫర్లు వారి ప్రతిభను నిరూపించుకోవాలని కోరారు. ఆసక్తి ఉన్న వారు వారి లఘు చిత్రాలను వాట్సాప్ ద్వారా ఈనెల 25వతేదీలోపు పంపాలని కోరారు. పంపాల్సిన వాట్సప్ నెంబర్లు 96763 50681, 72880 22467కు పంపాలని సూచించారు.

లఘుచిత్రాల పండుగ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

ప్రజాశక్తి-శింగనమల

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ విజయ్‌కుమార్

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ విజయ్‌కుమార్ హెచ్చరించారు. గురువారం రాత్రి మండల పరిధిలోని తరిమెలలో ప్రజలతో సమావేశమై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సి కలిగి ఉండాలని సూచించారు.

ఎన్టీఆర్ వర్ధంతికి భారీ ఏర్పాట్లు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతికి అనంత పురం నగరంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని భారీగా నిర్వహించేలా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈ నెల 18న ఎన్టీఆర్ వర్ధంతిని నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి సరిపూటి రమణ, పద్మశాలి ఫెడరేషన్ డైరెక్టర్ పోతుల నరసింహులు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ చాకలి పరమేష్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కడియాల కొండన్న, మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, ఇతర నాయకులు ఈ ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని పరిశీలించి, అక్కడ రంగులు వేయించారు. ఎన్టీఆర్ వర్ధంతి రోజున సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు నారాయణస్వామి యాదవ్, మణికంఠ బాబు, టిఎన్‌టియుసి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మోహన్ కుమార్, టిడిపి నాయకులు ఆదినారాయణ, తాటి మధు, మున్వర్, పూల బాషా, సిరిసాల రాంబాబు, చెక్క నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వర్ధంతి ఏర్పాట్లను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

IN THE COURT OF THE PRL SENIOR CIVIL JUDGE, ANANTAPURAMU
E.A.No:457/2022 IN EP.No.236/2019
IN O.S.No.114/2005

Between:-
The Karur Vysya Bank Ltd, A scheduled Bank, having its Regd. Office at Erode Road, Karur-2, Tamil Nadu State, having offices all over India and one such Branch at Anantapuramu Represented by it Branch Manger
...Petitioner/D.Hr
AND
P.Nizam and others ...Respondants/J.Drs

Notice J.Dr No:3

J.Dr No:3:P.Vannurappa S/o Yerriswamy, aged about 55 Yrs, Business, R/o D.No.28/489-C2, Opposite to Sri Satya Sal College for Woman, Sarada Nagar, Anantapuramu

పై నెంబరు కేసులో జె.డి.ఆర్. అయిన మీ హాజరు నిమిత్తం 20/01/2025వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
పి.క్రిష్ణస్వామి కుమార్,
అడ్వకేట్, అనంతపురం.

ఇస్తేమాకు తరలిన ముస్లిములు

రాయదుర్గం : ఈనెల 17, 18వతేదీల్లో కర్ణాటక రాష్ట్రంలోని మలకల్మూర్ పట్టణంలో జరగనున్న ఇస్తేమాకు రాయదుర్గం డివిజన్ నుంచి ముస్లిములు గురువారం భారీ ఎత్తున తరలివెళ్లారు. వెళ్లిన వారిలో రాయదుర్గం సిరాజ్, నూర్, తదితరులు ఉన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు...

ప్రజాశక్తి-గుత్తి

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న వైద్యులు

గ్రామాల్లో చిన్నారుల ఆరోగ్యంపై వైద్య, ఆరోగ్య సిబ్బంది నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు నిర్వహించి హెల్త్ రికార్డుల్లో నమోదు చేయాలని బేతాపల్లి పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ దేవేంద్రనాయక్ సూచించారు. గురువారం మండలంలోని కొత్తపేట గ్రామం విలేజ్ హెల్త్‌క్లినిక్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య, ఆరోగ్య సిబ్బంది అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలకు క్రమం తప్పకుండా వెళ్తూ చిన్నారులు, విద్యార్థులకు పరీక్షలు చేయాలన్నారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యాన్ని కాపాడేందుకు అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలన్నారు. అదే విధంగా ఎల్సీడీ కార్యక్రమంలో భాగంగా వైద్య, ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో ప్రతిఇంటినీ సందర్శించి సర్వే చేయాలన్నారు. బాల్య వివాహాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కెసి.రెడ్డెమ్మ, సిహెచ్ఒ వి.శోభారాణి, ఆరోగ్య కార్యకర్తలు శివప్రసాద్, నాగమ్మ, ఆశా కార్యకర్తలు సరోజ, లక్ష్మీదేవి, సాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల బకాయిలపై చర్చించాలి

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

నేడు జరగబోయే కేబినెట్ సమావేశంలో ఉద్యోగుల ఆర్థిక బకాయిలపై చర్చించాలని ఎపి ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్‌భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ఉద్యోగులకు ఐఆర్ ఇస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారన్నారు. ఇప్పటికే ఉద్యోగులకు రూ.20వేల కోట్ల కరువు భత్యం బాకాయిలు, సరెండర్ లీవులు, పిఎఫ్, ఎపి జిఎల్ఐ బాకాయిలు, మెడికల్ బిల్లులు తదితర అంశాలపై చర్చించాలని కోరారు.

వ్యాసరచన పోటీల విజేత విజయ సాయికుమార్

ప్రజాశక్తి-అనంతపురం

విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం, అనుబంధ సంస్థ డా.ఉమర్ ఆలీషా సాహితి సమితి భీమవరం నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో అనంతపురానికి చెందిన సాయిట్రస్టు అధ్యక్షులు విజయ సాయికుమార్ మొదటి బహుమతి సాధించాడు. ఈమేరకు జనవరి 23న భీమవరంలో నిర్వహించనున్న సాహిత్య సభలో డా.ఉమర్ ఆలీషాతో జ్ఞాపికతోపాటు ప్రశంసాపత్రాన్ని అందుకోనున్నట్లు ట్రస్టు ఉపాధ్యక్షులు టి.మురళీకృష్ణ తెలిపారు.

IN THE COURT OF THE III rd ADDL. JUNIOR CIVIL JUDGE,(Excise Court) ANANTAPURAMU
EP.No.264/2023 in O.S.No.1016/2022

Between:-
Smt. Kamsetty Anitha, ...D.Hr
AND
Sri G. Hanumantha Reddy ...J.Dr
To,
Sri G. Hanumantha Reddy, S/o G. Aswartha Reddy, working as contract Job on the Municipal Office at Anantapuram, R/at D.No:1-181, Rudrampeta, Anantapuramu Rural madal Anantapuram Dist,

J.Drకు order 21 Rule 66 CPC Notice

డిక్రీ హోల్డరుకు రావలసిన ఈ.పి.మొత్తము వసూలు చేయుటకు గాను ఈ.పి.లోని షెడ్యూలు ఆస్తిని జప్తు చేసి ఉన్నారు.సదరు ఈ.పి.వేలము షరతులు నిర్ణయించుటకు మీ యొక్క హాజరు నిమిత్తము 21/01/2025వ తేదిన వాయిదా వేసినారు. అందులకు మీకు ఆక్షేపణలు ఉన్న యెడల సదరి దినము ఉదయం 10:30 గం॥లకు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరు కావలెను.లేని యెడల మీ పరోక్షమునందు పై అర్జీని విచారించి తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
డి.ప్రణీత్ కుమార్, అడ్వకేట్,
అనంతపురం. సెల్:9885936377

పూర్తిస్థాయిలో రహదారి భద్రత మాసోత్సవాలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్

పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

జిల్లాలో ఈనెల 16 నుంచి ఫిబ్రవరి 15వతేదీ వరకు నిర్వహించే జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల కార్యక్రమాలను పూర్తి స్థాయిలో చిత్తశుద్ధితో నిర్వహించాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు– 2025 పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు ముఖ్యమైనవన్నారు. రహదారి భద్రత కార్యక్రమాలు ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా చేపట్టాలన్నారు. జిల్లాలో జనవరి 16వ తేదీ నుంచి ఫిబ్రవరి 15వతేదీ వరకు జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల యాక్టివిటీలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, అడిషనల్ ఎస్పీ డివి.రమణమూర్తి, డిటిసి వీర్రాజు, డిసిహెచ్ఎస్ డా॥పాల్ రవికుమార్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డా॥వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ డా॥కిరణ్ కుమార్ రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న గుమ్మనూరు ఈశ్వర్

పామిడి : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ పక్కన చేపట్టిన కాలువ మరమ్మతులను ఎమ్మెల్యే తనయుడు, మండల టిడిపి ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ గురువారం పరిశీలించారు. ఆయా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. అలాగే మండల కేంద్రంలో మరెన్నో అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామన్నారు. కచ్చితంగా ఇచ్చిన మాట ప్రకారం పామిడి మండలాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

టిడిపిలో చేరుతున్న వైసిపి నాయకులు

కళ్యాణదుర్గం రూరల్ : పట్టణంలోని ప్రజావేదికలో వైసిపికి చెందిన నాలుగు కుటుంబాలు గురువారం టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరికి నియోజవర్గ నాయకులు దేవినేని ధర్మతేజ టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలోకి చేరిన బ్రహ్మసముద్రం మండలం ముద్దలాపురం గ్రామానికి చెందిన బి.మణికంఠ, లింగన్న, మారుతీ, గంగన్న మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన అభివృద్ధిని చూసి టిడిపిలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వెంకటేశులు, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ వైపి.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE III rd ADDL.DISTRICT JUDGE, ANANTAPURAMU
I.A.No.1061/2017 in O.S.No.124/2014

Between:-
Kanekal Vasantha Kumar Jayakumar and others
...Petitioners/Plaintiffs
AND
Kanekal Ramesh Meenakshi and others
...Respondants/Defendants

Notice To Respondant No: 30,31,32,33 & 38

R30: Kanekal Saroja, major, Hindu, sinecure,
R31: Kanekal Sakala, major, Hindu, sinecure,
R32: Kanekal Sandhya, major, Hindu, sinecure,
R33: Kanekal Sowmya, major, Hindu, sinecure,
30 and 33 are children of Kanekal Ramakrishnappa Shoba, all are residing at 124, Jaganath Temple Street, Radio Park, Cowl Bazaar, Bellary, Karnataka
R38: K.A.Nivedita W/o Harishankar, aged about 32 years, Hindu, R/o D.No.2, Sudarshan Naidu Street, Radio Par, Cowl Bazar, Bellary, Karnataka

పై నెంబరు కేసులో రెస్పాండెంట్స్ అయిన మీ హాజరు నిమిత్తం 28/01/2025వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
D.SHYAM SUNDER, K.MOHAN RAO
Advocates, Ananthapuramu. Cell:9440258700

మానవ తప్పిదాలతోనే రోడ్డుప్రమాదాలు

ప్రజాశక్తి-రాయదుర్గం

మాట్లాడుతున్న ఎంవిఐ విశ్వనాథరెడ్డి

ప్రస్తుతం సంభవిస్తున్న రోడ్డు ప్రమాదాలు చాలావరకు మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని రవాణా శాఖ వాహన తనిఖీ అధికారి విశ్వనాథరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ శ్రీనివాసులు అధ్యక్షతన రోడ్డు భద్రత మాస ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ యాంత్రిక తప్పిదాల కంటే మానవ తప్పిదాల వల్లనే ప్రమాదాలు అధికంగా జరుగుతున్నట్లు చెప్పారు. డ్రైవర్లు వాహనం నడిపేప్పుడు సెల్‌ఫోన్లు వాడరాదన్నారు. మద్యం సేవించరాదన్నారు. డిపో మేనేజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ గత ఏడాది రాయదుర్గం డిపో పరిధిలో కేవలం ఒకే ఒక్క రోడ్డు ప్రమాదం జరిగిందన్నారు. సీనియర్ జర్నలిస్ట్ శివకుమార్ మాట్లాడుతూ బస్సు డ్రైవర్లు వాహనం నడిపే సమయంలో ప్రయాణికుల రక్షణను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎఎంఎఫ్ శిరీషా, గ్యారేజ్ సిబ్బంది డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన

కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యులు

యల్లనూరు : మండల పరిధిలోని తిమ్మంపల్లి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో కుష్టువ్యాధి నిర్మూలనపై వైద్యాధికారిణి కీర్తన, డిపిఎంఓ రామచంద్ర ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 2వతేదీవరకూ ఎల్ సిడిసి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులుఓ భాగంగా ఎఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించాలన్నారు. ఒకవేళ ఎవరికైనా అలాంటి లక్షణాలు కనిపిస్తే చికిత్సకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ లక్ష్మీనారాయణమ్మ, హెల్త్ సూపర్‌వైజర్లు ఎస్.రాము, ఎస్.విజయలక్ష్మి, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పి, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

IN THE COURT OF THE Ist ADDL.JUNIOR CIVIL JUDGE, ANANTAPURAMU
E.P.No.104/2024 in O.S.No.677/2006

Between:-
R.S.Jayalakshmi Bai ...Petitioner/D.Hr
AND
R.S.Mohan Rao ...Respondant/ J.Dr

Notice To J.Dr

To,
R.S.Mohan Rao S/o Late R.S.Narasoji Rao R/of D.No:2-74, 1st Road, Ananthapuramu.

పై నెంబరు కేసులో జె.డి.ఆర్.అయిన మీ హాజరు నిమిత్తం 12/03/2025వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
D.Chenna reddy Advocate,
Ananthapuramu. Cell:9440547247

మృతిచెందిన గొర్రెలకు పరిహారం చెల్లింపు

బెలుగుప్ప : మండల పరిధిలోని బెలుగుప్ప తండాకు చెందిన వెంకటేశులు నాయక్‌కు ప్రభుత్వం నుంచి మంజూరైన పరిహారం ఖాతాలో జమ అయింది. వెంకటేశులు నాయక్‌కు చెందిన 11 గొర్రెలు 2020 నవంబర్ 14న విష ప్రభావంతో మృతిచెందాడు. దీంతో అప్పట్లో పశువైద్యాధికారి పోస్టుమార్టం నిర్వహించి పశు నష్టపరిహారం పథకానికి నివేదికలు పంపారు. ఇందుకు ప్రభుత్వం నుంచి ఈనెల 13వతేదీన రూ.60,500 మంజూరైనట్లు తెలిపారు. దీంతో వెంకటేష్‌నాయక్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జిల్లా కార్యదర్శి మల్లికార్జున మాజీ ఎంపిటీసీ లక్ష్మీబాయి గోవింద నాయక్ గోపాలమిత్ర ఎర్రి స్వామి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కొత్తపేటలో ఇరువర్గాల ఘర్షణ

గుత్తి : రస్తా విషయంలో గురువారం మండలంలోని కొత్తపేట గ్రామంలో ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా మేరకు.. గ్రామానికి చెందిన రంగనాథ్, చంద్రయ్య, పెద్దచంద్రయ్య, చంద్రశేఖర్, రాఘవేంద్ర, కుమార్‌కు ఇంటి సమీపంలో గత కొన్ని నెలలుగా రస్తా విషయంలో గొడవలు ఉండేవి. ఈ క్రమంలో మరోమారు ఇరువర్గాలు గొడవ పడిపరస్పరం దాడులకు పాల్పడ్డారు. దాడిలో గాయపడిన రంగనాథ్ ను గమనించిన కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

గుత్తి : మండలంలో గురువారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఊబిచెర్ల గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై గురువారం ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, బాధితులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పొదొడ్డి గ్రామానికి చెందిన జయరాముడు, ఐదు నెలల గర్భవతి అయితే తన కుమార్తె రజనీని గుంతకల్లులోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో వైద్యపరీక్షల కోసం ద్విచక్ర వాహనంలో తీసుకెళ్తున్నాడు. అయితే ఊబిచెర్ల గ్రామ శివారులో జయరాముడు, రజని గుత్తి వైపునకు ద్విచక్రవాహనంలో వస్తుండగా అనంతపురం వైపునకు వెళ్తున్న లారీ వెనుక వైపు నుంచి వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో బైక్ నుంచి ఎగిరి రోడ్డుపై పడి అపస్మారక స్థితిలో పడి ఉన్న జయరాముడు, కుమార్తె రజనిని గమనించిన స్థానికులు హైవే అంబులెన్స్‌కు సమాచారం అందించి ఇద్దరికి చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు ఇద్దరిని అనంతపురం తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అలాగే మండలంలోని ఊబిచెర్ల గ్రామ శివారులో జిల్లా సరిహద్దు పొదొడ్డి వద్ద గురువారం ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. పట్టణంలోని చెర్లోపల్లి కాలనీకి చెందిన సంతోష్, శివలు పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో నంద్యాల జిల్లా డోన్‌కు బయలుదేరారు. అయితే పొదొడ్డి గ్రామశివారులో 44వ జాతీయ రహదారిపై ప్యాపిలి వైపు వెళ్తున్న ఆటో వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో ద్విచక్రవాహనంలో నుంచి ఎగిరి రోడ్డుపై పడి సంతోష్‌కు ఎడమకాలు విరిగి తీవ్రంగా గాయపడగా.. శివకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరినీ స్థానికులు చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు కాలు విరిగి తీవ్రంగా గాయపడిన సంతోష్ ను మెరుగైన చికిత్సలకు అనంతపురం తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరులు అరెస్టు

అనంతపురం క్రైం : ముగ్గురు జూదరులను అరెస్టు చేసి రూ.5200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు త్రీటౌన్ సిఐ కె.శాంతిలాల్ తెలిపారు. స్టేషన్ పరిధిలోని శ్రీశైలం ఫంక్షన్ హాలు వెనుక ముళ్లపొదల్లో పేకాట ఆడుతుండగా పట్టుకుని కోర్టులో హాజరు పరిచినట్లు సిఐ తెలిపారు.

కుక్కల దాడిలో 24 గొర్రెపిల్లలు మృతి

శింగనమల : కుక్కల దాడిలో 24 గొర్రెపిల్లలు మృతి చెందినట్లు ఘటన గురువారం మండల పరిధిలోని సోదనపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. బాధిత గొర్రెల కాపరి హరిజన కర్రి సూర్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. సూర్యనారాయణ గొర్రెలు మేపుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇందులో భాగంగానే గ్రామ సమీపంలోని పెద్దకుంట వద్ద కళ్లం ఏర్పాటు చేసుకుని గొర్రెలను తోలుకునేవాడు. రోజూ మాదిరే గొర్రెలను మేపునకు తీసుకెళ్లారు. ఈనేపథ్యంలో ఉదయం గొర్రెల దొడ్డిలో ఉన్న 24 గొర్రె పిల్లలను నరసాపురం గ్రామానికి చెందిన కుక్కలు దాడి చేసి చంపాయి. మధ్యాహ్నం సమయంలో గొర్రెలను తీసుకొచ్చిన నారాయణస్వామి గొర్రెపిల్లలు మృతిచెందడాన్ని గమణించి బోరున విలపించాడు. చనిపోయిన గొర్రె పిల్లల విలువ దాదాపు రూ.1.50లక్షల వరకూ నష్టం సంభవించినట్లు ఆందోళన వ్యక్తం చేశాడు. రెక్కాడితేగాని డొక్కాడని తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

మృతిచెందిన గొర్రె పిల్లల వద్ద దిగాలుగా ఉన్న కాపరి సూర్యనారాయణ